# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ కర్మాగారంగా భారతదేశం రూపొందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- వ్యవసాయ రంగం వృద్ధి, గ్రామీణ శ్రేయస్సు సాధించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
- మణిపూర్ లోని అన్ని మార్గాల్లో ఈనెల 8 నుంచి ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు.
- సాంకేతికతను ఉపయోగించడం వల్ల ప్రజల నుండి వసూలు చేసే పన్నులను సమర్ధవంతంగా వినియోగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.
- అహ్మదాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టును కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు పరిశీలించారు.

=======================

ప్రపంచ కర్మాగారంగా భారతదేశం రూపొందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ రాజధానిలో నిర్వహించిన ఒక సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడుతూ... శ్రామిక శక్తిగా పేరుపొందిన భారతదేశం ప్రస్తుతం ప్రపంచ శక్తిగా మార్పు చెందిందని అన్నారు. సెమీకండక్టర్లు, విమాన వాహక నౌకల తయారీ వంటి వాటిలో వేగంగా అభివృద్ధి చెందుతూ.. ఆటోమొబైల్ ఉత్పత్తిదారుగా మారిందని పేర్కొన్నారు. దేశం అభివృద్ధిలో ముందడుగు వేస్తూ అనేక ప్రపంచ వ్యాప్త కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తోందని తెలిపారు. ఇటీవల పెద్ద ఎత్తున నిర్వహించిన మహాకుంభమేళా భారతదేశం పాటించే నిర్వహణా నైపుణ్యాలు, ఆవిష్కరణలను ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన వెల్లడిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

=======================

వ్యవసాయ రంగం వృద్ధి, గ్రామీణ శ్రేయస్సు సాధించడం అనే రెండు లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వ్యవసాయం గ్రామీణ శ్రేయస్సుపై బడ్జెట్ అనంతర విషయాలపై దృశ్యమాధ్యమ విధానంలో ఆయన ఈరోజు రైతులతో చర్చించారు. అభివృద్ధి చెందిన భారతదేశం అనే

లక్ష్యం వైపు పయనించాలనే సంకల్పం చాలా స్పష్టంగా ఉందని ఆయన అన్నారు. "ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం" కింద ఇప్పటివరకు రైతులకు దాదాపు 3.75 లక్షల కోట్ల రూపాయలు అందించామని నరేంద్రమోదీ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం 'ప్రధాని ధన్ ధాన్య కృషి యోజన'ను ప్రకటించిందని, దీని కింద దేశంలో అత్యల్ప వ్యవసాయ ఉత్పాదకత కలిగిన 100 జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారిస్తామని ప్రధానమంత్రి వెల్లడించారు.

========================

మణిపూర్ లోని అన్ని మార్గాల్లో ఈనెల 8 నుంచి ప్రజల రాకపోకలు స్వేచ్ఛాయుతంగా సాగేలా చర్యలు తీసుకోవాలని రక్షణ శాఖ అధికారులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న అక్కడి భద్రతా పరిస్థితులపై ఉన్నత స్థాయి అధికారులతో ఈరోజు కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. ఢిల్లీలో నిర్వహించిన ఈ సమావేశంలో మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆర్మీ, పారామిలటరీ అధికారులు పాల్గొన్నారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాత అక్కడి పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించడం ఇదే మొదటిసారి.

========================

ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలోని మన గ్రామంలో హిమపాతం సంభవించిన తరువాత ఇప్పటివరకు 50 మంది కార్మికులను రక్షించామని అధికారులు తెలిపారు. మిగిలిన 5 మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సహాయక చర్యలను సమీక్షించడానికి ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రభావిత ప్రాంతంలో వైమానిక సర్వే నిర్వహించారు. ఈ ఆపరేషన్ గురించి జ్యోతిర్మఠ్‌లోని ఆర్మీ సిబ్బంది, రెస్క్యూ ఏజెన్సీల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సహాయ, రక్షణ చర్యలు సమర్థవంతంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహాయక చర్యలను సమీక్షించారు. అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం నుండి అన్ని విధాలా సహకరిస్తామని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు.

========================

జన్ ఔషధి... జన్ చేతన.. వారోత్సవాలను పురస్కరించుకుని న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన రథాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా, సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ప్రారంభించారు. ఈరోజు నుండి ఈనెల 7వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరపనుండగా మార్చి 7న జన్ ఔషధి దివస్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి పరియోజనను ప్రజా ఉద్యమంగా మార్చాలని ప్రతి ఒక్కరినీ కోరారు. ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించిందని ఆయన అన్నారు. 2014కి ముందు జన్ ఔషధి కేంద్రాలు కేవలం 80 మాత్రమే ఉండేవని, ఇప్పుడు దేశంలోని వివిధ ప్రాంతాలలో 15 వేలకు పైగా ఉన్నాయని కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు.

విరామం

========================

సాంకేతికతను ఉపయోగించడం వల్ల ప్రజల నుండి వసూలు చేసే పన్నులను సమర్థవంతంగా వినియోగిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 49వ సివిల్ అకౌంట్స్ డే వేడుకల్లో ఆమె మాట్లాడుతూ.. పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పారదర్శకతతో 60 కోట్ల మంది లబ్ధిదారులకు సేవలు అందిస్తుందని అన్నారు. ఈ వ్యవస్థ 1,211 పథకాలను నిర్వహిస్తుందని, వాటిలో 1,100 ప్రత్యక్ష ప్రయోజన బదిలీ కింద ఉన్నాయని కేంద్ర మంత్రి అన్నారు.

(వాయిస్ 27 సెకన్లు)

=======================

కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు అహ్మదాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బుల్లెట్ రైలు ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ ప్రాజెక్టులో 360 కిలోమీటర్లు పూర్తయిందని, మహారాష్ట్ర విభాగంలో పురోగతి సాధిస్తున్నామని, సముద్రగర్భ సొరంగంలో దాదాపు 2 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని వెల్లడించారు.

(వాయిస్ 24 సెకన్లు)

ఇదిలా ఉండగా, కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్నీత్ సింగ్ బిట్టు ఈరోజు మొదటి సారిగా ఈ ప్రాజెక్టును పరిశీలించారు. భారతదేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇది కీలకమైన ముందడుగుగా ఆయన అభివర్ణించారు.

=======================

ఛాంపియన్స్ ట్రోఫీలో భాగాంగా దక్షిణ ఆఫ్రికా ఇంగ్లాంగ్ జట్లు మధ్య  ఈరోజు జరిగి మ్యాచ్ లో 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా భారీ విజయం సాధించింది. దీంతో ఆస్ట్రేలియాతో పాటు దక్షిణాఫ్రికా సెమీ ఫైనల్ అర్హత సాధించింది. మరోవైపు గ్రూప్- ఏ లో భారత్ న్యూజిలాండ్ జట్ల మధ్య రేపు ఆఖరి లీగ్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ విజయం సాధించిన జట్టు సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాతోనూ.. ఓడిన జట్టు ఆస్ట్రేలియాతోను సెమీ ఫైనల్ ఆడనుంది.

=======================

దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య నియంత్రణా చర్యల్లో భాగంగా 15 సంవత్సరాలు  పైబడిన వాహనాలకు ఈనెల 31వ తేదీ తర్వాత పెట్రోల్ బంక్ ల్లో ఇంధనం నిషేదిస్తూ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా ఈరోజు అధికారులతో జరిగిన భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆంక్షలకు సంబంధించి కేంద్ర పెట్రోలియం శాఖకు సమాచారం ఇస్తామని తెలిపారు. అదేవిధంగా ఎత్తైన భవనాలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో యాంటీ స్మోగ్ గన్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.

=======================

వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ - WAVES బ్యాటిల్ ఆఫ్ ది బ్యాండ్స్ అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్‌లను ఆహ్వానిస్తోంది. ప్రసార భారతి,  SAREGAMA సహకారంతో WAVES మొదటి సీజన్ క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా పాల్గొనే బ్యాండ్‌లు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన వేదికను అందిస్తుంది. ఈ పోటీలకు రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా మార్చి 10న ముగుస్తాయని అధికారులు తెలిపారు.

=======================

దేశవ్యాప్తంగా రంజాన్ మాసం రేపటి నుంచి ప్రారంభం కానున్నట్లు ఇస్లాం పెద్దలు ప్రకటించారు. మన దేశంలో నిన్న ఎక్కడా నెలవంక దర్శనం కాకపోవడంతో రేపటి నుంచి ఉపవాసాలు చేపట్టనున్నారు.

=======================
=======================